సాక్షి
నిర్మల్
సోమవారం । 3 । జూన్ । 2024



సైక్లింగ్‌తో ఆరోగ్యం

నిత్యం సైకిల్ తొక్కితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. 8లో▸



ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామంలో మూడురోజులుగా కొనసాగుతున్న లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0 /28.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. జిల్లాలో పలుచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

బాసరలో భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

భైంసా: బాసరలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. అధికసంఖ్యలో భక్తులు సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. ముందుగా గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్ భక్తులతో కిటకిటలాడాయి.

ఢిల్లీలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లావాసులు



ఢిల్లీలో నిర్వహించిన వేడుకల్లో జిల్లావాసులు

నిర్మల్‌చైన్‌గేట్: ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ దశాబ్ది వేడుకల్లో జిల్లాకు చెందిన పలువురు పాల్గొన్నారు. వారిలో శశిరాజ్, అంగ జగదీశ్వర్, అయ్యన్నగారి శ్రీకాంత్, వేముల సుదర్శన్, ద్యావరశెట్టి మారుతి ఉన్నారు.

కౌంటింగ్ ఏజెంట్ల సమావేశం



మాట్లాడుతున్న భూమయ్య

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌లో పాల్గొనే నిర్మల్ అసెంబ్లీకి చెందిన కౌంటింగ్ ఏజెంట్ల సమావేశం ఆదవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏజెంట్లకు సూచించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అలివేలు మంగ, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీగాదే విలాస్ పాల్గొన్నారు.

ఓలాలో వైద్యశిబిరం

కుంటాల: ఓలా గ్రామంలో భైంసా ఆరుష్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. 80మంది నవజాత శిశువులు, చిన్నారులను పరీక్షించి మందులు అందజేశారు. వైద్యుడు నరేశ్, కార్యదర్శి యోగేశ్, డాక్టర్ మారుతి, మహేశ్ తదితరులున్నారు.

త్యాగధనులను మరువొద్దు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- ఘనంగా తెలంగాణ దశాబ్ది వేడుకలు

నిర్మల్‌చైన్‌గేట్: త్యాగధనులను మరువొద్దని, వారి పోరాటాల ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిందని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాన్ని ఆదివారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన ఎస్పీ, ఇతర శాఖల జిల్లా అధికారులతో కలిసి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. తెలంగాణ ఉద్యమ తీరును గుర్తు చేస్తూ, స్వరాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమర వీరులందరికీ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భం



వేదికపై మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

గా మాట్లాడుతూ.. అందరి భాగస్వామ్యంతో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో జిల్లా, రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు, చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోనూ అదనపు కలెక్టర్లు



జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పాఠశాలల విద్యార్థులకు నోటుబుక్‌లు అందజేసి, స్వీట్లు పంచారు. ఆర్డీవో రత్నకళ్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్‌రెడ్డి, అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కళాకారులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.



పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్





నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

బంగారు తెలంగాణలో భాగస్వాములమవుదాం

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: అమరుల త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుకునేందుకు పోలీస్‌శాఖ తరఫున భాగస్వాములమవుదామని ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఎస్పీ క్యాంపు, పోలీస్, సాయుధదళ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ధనిక, పేద తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ సేవలందించి పోలీస్‌శాఖకు మంచిపేరు తీసుకురావాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, సీఐలు, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్సైలు, ఎస్సైలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మల్‌టౌన్: జెండా ఆవిష్కరిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల



భైంసా: జెండా ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటరమణ

బాసర ట్రిపుల్ ఐటీలో..

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ జాతీయ జెండా ఆవిష్కరించారు. స్పెషలాఫీసర్ సృజన, సెక్యూరిటీ ఆఫీసర్ రాకేశ్, పీఆర్వో డాక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘బడిబాట’ వాయిదా

నిర్మల్‌ఖిల్లా: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల కోసం నిర్వహించనున్న బడిబాట కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 3నుంచి 19వ తేదీ వరకు బడిబాట నిర్వహించేందుకు ముందుగా షెడ్యూల్ విడుదల కాగా, ప్రస్తుతం దీనిని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తదుపరి నూతన షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ త్వరలో విడుదల చేయనుందని తెలిపారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బడిబాట కార్యక్రమాన్ని వాయిదా వేయాలని విజ్ఞప్తులు చేసిన సంగతి తెలిసిందే.

నేటి నుంచి ‘పది’ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు..

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లా 99 శాతానికిపైగా ఫలితాలు సాధించి రాష్ట్రంలో వరుసగా రెండోసారి కూడా మొదటి స్థానంలో నిలిచింది. జిల్లా మొత్తంగా 100మంది విద్యార్థులు మాత్రమే ఫెయిల్ కాగా ఇందులో 82మంది పరీక్ష ఫీజు చెల్లించారు. వీరి కోసం జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేటలోగల ప్రభుత్వ బాలికల పాఠశాలలో పరీక్షాకేంద్రం ఏర్పాటు చేశారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కౌంటింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న అనిల్‌కుమార్ పాండే, హిమాన్ష్‌కుమార్ గుప్తా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ఆదివారం పూర్తయింది. కౌంటింగ్ పరిశీలకులు అనిల్ కుమార్‌పాండే, హిమాన్ష్‌కుమార్ గుప్తా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా సమక్షంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టారు. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు సంబంధించి సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈనెల 4న నిర్వహించనున్న ఓట్ల లెక్కింపులో 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున అదనంగా 20 శాతం కలుపుకొని 378 ఈవీఎం కౌంటింగ్ సిబ్బంది, అలాగే పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 65 మందిని నియమించామన్నారు. 17 సీఎస్, 31 సీఏ, 13 ఎంవోల నిర్వహణపై వీరికి శిక్షణ ఇచ్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. నిర్మల్ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఈవో రవీందర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో అరవింద్ కుమార్, మూడు జిల్లాల ఈడీఎంలు తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ం.. ఆత్మీయం..

- పలు పాఠశాలల్లో సమ్మేళనాలు
- సందడి చేసిన పూర్వవిద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా/కడెం/సోన్/ఖానాపూర్/కుంటాల: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఎన్నో ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఇప్పుడు ఆత్మీయ సమ్మేళనాల పేరిట అంతా ఒక్కచోట కలుసుకుంటున్నారు. ఆత్మీయంగా పలకరించుకుని ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుంటున్నారు. రోజంతా సరదాగా గడిపి ఎన్నో అనుభూతులను మూటగట్టుకుని తిరిగి వెళ్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ పాఠశాలకు చెందిన 80 మంది 1999–2000 విద్యాసంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని రోజంతా సరదాగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు. కడెం మండలం అంబారిపేట్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2009–10 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు కొండుకూర్ గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. పాఠశాలలో చదివిన రోజులు గుర్తు చేసుకుని రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. సోన్ మండలం మాధాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2007–08 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఒక్కచోట చేరి రోజంతా సరదాగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, అప్పటి ఉపాధ్యాయులు కే రమేశ్, జీ రమేశ్, భాగ్యరావ్, సదానందం, శంకర్, ఉమాదేవి తదితరులున్నారు. ఖానాపూర్ మండలం మస్కాపూర్ ఎల్ఆర్ గార్డెన్‌లో స్థానిక జెడ్పీహె



ఖానాపూర్: మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ పూర్వవిద్యార్థులు



నిర్మల్‌ఖిల్లా: రాధాకృష్ణన్ స్కూల్ పూర్వవిద్యార్థులు

చ్ఎస్‌కు చెందిన 2010–11 పదో తరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం పేరిట అంతా ఒక్కచోట కలుసుకున్నారు. ముందుగా తాము చదువుకున్న పాఠశాలను సందర్శించి కాసేపు అక్కడే గడిపారు. అప్పటి హెచ్ఎం వెంకన్న, ఉపాధ్యాయులు రమేశ్, ప్రకాశ్, నరేందర్, వరప్రసాద్, గోపాల్, ఉషారాణి, స్వప్నను సన్మానించారు. కుంటాల ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.53 కోట్లు మంజూరు చేయగా నూతన భవనం నిర్మించనున్నారు. 55 ఏళ్ల పాఠశాల భవనాన్ని త్వరలో కూల్చివేయనున్నారు. దీంతో 1988 నుంచి 2004–05 వరకు ఇందులో చదివిన పలువురు పూర్వవిద్యార్థులు పాఠశాలను సందర్శించి ఫొటోలు తీయించుకున్నారు.



కుంటాల: పాఠశాల భవనం ఎదుట పూర్వవిద్యార్థులు



కడెం: అంబారిపేట్ జెడ్పీ హైస్కూల్ పూర్వవిద్యార్థులు



సోన్: మాధాపూర్ హైస్కూల్ పూర్వవిద్యార్థులు

ఆర్‌ఎంపీలపై సీరియస్..

- అర్హత లేకుండా వైద్యంపై నజర్
- ఇష్టారీతిన చికిత్స చేస్తే కేసులు
- ‘ప్రథమ చికిత్స’కే అనుమతి
- తరచూ మెడికల్ కౌన్సిళ్ల దాడులు
- పలువురిపై కేసులు నమోదు

నిర్మల్: అర్హత లేకున్నా.. తమ హద్దులు దాటి వైద్య పరీక్షలు, చికిత్స చేస్తున్న ఆర్‌ఎంపీల తీరుపై మెడికల్ కౌన్సిళ్లు, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ సీరియస్‌గా స్పందిస్తున్నాయి. కరోనా తర్వాత ఆర్‌ఎంపీల్లో చాలామంది ఇష్టారీతిన వైద్యం చేస్తున్నట్లు, వారి చికిత్స కారణంగా పలువురు మరణించినట్లు, ఇతర వ్యాధుల బారిన పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వారు హద్దులు దాటి వైద్యం చేయడమే కాకుండా అధిక కమీషన్ల కోసం వారికి తెలిసిన ఆస్పత్రులకే సిఫారస్ చేస్తున్న ఘటనలూ వెలుగులోకి వచ్చాయి. గ్రామాల్లో వారే ‘డాక్టర్’లుగా చలామణి అవుతున్న తీరుపైనా ఫిర్యాదులు రావడంతో మెడికల్ కౌన్సిళ్లతోపాటు వైద్యారోగ్యశాఖ సీరియస్‌గా తీసుకుంటోంది. ఈక్రమంలో ఇటీవల నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ), తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) బృందాలు జిల్లాలోనూ ఆకస్మిక దాడులు చేస్తున్నాయి. తనిఖీలతోనే వదిలిపెట్టకుండా సీరియస్ కేసులనూ నమోదు చేస్తుండటం సంచలనంగా మారింది. నిర్మల్‌లోనే ఏకంగా 10మందిపైన ఎఫ్ఐఆర్ నమోదు చేయడం గమనార్హం.



అన్ని చికిత్సలు చేసేస్తూ..

జిల్లాలో కొంతమంది ఆర్‌ఎంపీలు తమ పరిధి దాటిపోయారు. ప్రథమ చికిత్సను దాటి ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్.. చివరకు గైనకాలజిస్ట్, కార్డియాలజిస్టులుగానూ మారిపోయారు. పిల్లలు పుట్టని వారికి మందులు ఇవ్వడమే కాదు.. అసలు పిల్లలే పుట్టకుండా అబార్షన్లనూ చేసేస్తున్నారు. ఆర్‌ఎంపీలు బీపీ చూడటానికే నిబంధనలు ఒప్పుకోవు. అలాంటిది బీపీ టాబ్లెట్లు రాసిస్తున్నవాళ్లూ ఉన్నారు. కొంతమంది ఆర్‌ఎంపీల దగ్గర జిల్లాకేంద్రంలోని ప్రముఖ ఆస్పత్రుల్లో కూడా ఉండనంత ఓపీ ఉండటం తనిఖీ బృందాలనే నివ్వెరపరిచింది. ఎందుకింత ఉంటున్నారని ఆరా తీస్తే.. ‘ఏ రోగమైనా.. ఈ డాక్టర్ సాబ్ జల్దీ తక్కువ చేస్తడు.. ఎక్కువ గోలీలు కూడా రాయడు.. రెండుమూడు ఇంజక్షన్లతోనే రోగం తక్కువై పోతది..’అని పేషెంట్లు చెప్పడం గమనార్హం. మోతాదుకు మించి యాంటీబయాటిక్స్, స్టిరాయిడ్స్ ఇస్తుండటంతోనే ఇలా.. రోగం త్వరగా నయమవుతుందని, వీటితో భవిష్యత్‌లో తమకు ఊహించని ఆరోగ్య సమస్యలు వస్తాయన్న విషయాన్ని ప్రజలు గుర్తించడం లేదని మెడికల్ కౌన్సిల్ బృందాలు విచారం వ్యక్తంచేశాయి.

ప్రథమచికిత్స వరకే..

తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్–2010 ప్రకారం ఆర్‌ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స చేసేందుకు మాత్రమే అర్హులు. గ్రామాల్లో అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందించి, వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి పంపించడమే వారు చేయాల్సిన పని. వారు ఉంటున్న గదికి క్లినిక్.. ఆస్పత్రి.. నర్సింగ్‌హోం.. మెడికల్‌హాల్.. అని కూడా పెట్టుకోవడానికి లేదు. వారి పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదన్న గైడ్‌లైన్స్ ఉన్నాయి. వారి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ఇన్‌పేషెంట్లు ఉండటానికి కూడా వీలు లేదు. కానీ.. జిల్లాలో చాలామంది ఆర్‌ఎంపీలు తాము సీనియర్లమన్న ధీమాలో అసలు నిబంధనలు మరిచిపోయారు. ప్రథమ చికిత్స కేంద్రాలు కాకుండా చిన్నపాటి ఆస్పత్రులనే నడుపుతున్నారు. ఇవే ఇప్పుడు వైద్యాధికారుల దాడులకు కారణమవుతున్నాయి.

ఈసారి సీరియస్‌గానే..

గతంలోనూ జిల్లాలో ఆర్‌ఎంపీలు, వారి ఆస్పత్రులపై దాడులు జరిగాయి. కానీ.. అవన్నీ తూతూమంత్రమే అన్నట్లుగా సాగాయి. గతంలో తనిఖీలు చేసిన వైద్యాధికారుల్లో చాలామంది సదరు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీలు, అర్హతలేని వైద్యుల నుంచి డబ్బులు తీసుకుని బేరసారాలు నడిపినట్లు స్పష్టమైంది. ప్రస్తుతం వైద్యారోగ్యశాఖ చేస్తున్న దాడులపైనా చాలామందికి నమ్మకం కలగడం లేదు. కానీ.. గతనెల 16న జిల్లాకేంద్రంలో దాడులు చేపట్టిన ఎన్ఎంసీ, టీఎస్ఎంసీలు మాత్రం చాలా సీరియస్‌గా తీసుకుంటున్నాయి. నిబంధనలు అతిక్రమించి ఎవరు వైద్యం చేసినా ఏకంగా ఎఫ్ఐఆర్‌లు, కేసులు నమోదు చేయిస్తుండటం గమనార్హం. ఈక్రమంలోనే జిల్లాకేంద్రంలో 10మంది ఆర్‌ఎంపీలపైన కేసులు నమోదయ్యాయి. రెండు ఆర్‌ఎంపీ యాజమాన్య ఆస్పత్రులకు నోటీసులు వచ్చాయి. దీంతో చాలామంది ఆర్‌ఎంపీలు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే పలువురు తాత్కాలికంగా తమ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్లను మూసుకున్నారు. ప్రభుత్వానికి సంబంధం లేకుండా టీఎస్ఎంసీ కార్యవర్గం ఎన్నిక కావడం, అందులో ఉన్న బాధ్యులంతా వైద్య రంగ ప్రక్షాళన కోసం పాటుపడతామని కౌన్సిల్ ఎన్నికల్లో ప్రచారం చేయడంతో ఆ మాటను నిలబెట్టుకునే దిశలో వెళ్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు జిల్లాలో మరిన్ని దాడులు కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ దాడులను అర్హత కలిగిన వైద్యులతోపాటు ఐఎంఏ బాధ్యులూ స్వాగతిస్తున్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే, కార్యకర్త మధ్య ఆడియో సంభాషణ వైరల్

భైంసాటౌన్: ఎమ్మెల్యే రామారావుపటేల్, ముధోల్ మండలానికి చెందిన బీజేపీ కార్యకర్తతో జరిగిన సంభాషణ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. 1.25 నిమిషాలు ఉన్న ఆడియోలో సదరు కార్యకర్త పార్టీ కోసం పనిచేసినా తమను పట్టించుకోవడం లేదని పేర్కొనగా, నీ ఒక్కడి ఓటుతోనే గెలవలేదంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ఉంది. ఈ విషయమై ఎమ్మెల్యేను ఫోన్‌లో వివరణ కోరగా, దురుద్దేశంతోనే వైరల్ చేశారని, పూర్తి వివరాలు పరిశీలించిన తర్వాత స్పందిస్తానన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భైంసారూరల్: మండలంలోని హజ్గుల్ సమీపంలోని వాగు వద్ద పేకాటస్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15,390 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

లైన్‌మెన్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న కిరణ్‌కుమార్

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన విద్యుత్ లైన్‌మెన్ ఎరెడ్ల కిరణ్‌కుమార్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. ఆదివారం ఆయనకు వరంగల్‌లో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి ఈ అవార్డును అందించారు. విధులు బాధ్యతాయుతంగా నిర్వహించినందుకు ఈ అవార్డు రావడంపై కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

జొన్న లేపాకులు తిని 9 ఆవులు మృతి



మృతిచెందిన ఆవులు

నార్నూర్: మండలంలోని సుంగాపూర్ శివారులోని పొలంలో జొన్న లేపాకులు తిని 9 ఆవులు ఆదివారం మృతిచెందాయి. వివరాలు ఇలా ఉన్నాయి. రైతులు మొత్తం 20కి పైగా ఆవులు ఉదయం 9 గంటలకు మేత కోసం వదిలారు. అవి జొన్న లేపాకులు తిన్నాయి. ఆరగంట తర్వాత ఒక్కో ఆవు మృతి చెందడంతో గమనించిన గ్రామస్తులు వెంటనే పశువైద్యాధికారి రాథోడ్ రమేశ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన వెంటనే సిబ్బందిని సంఘటన స్థలానికి పంపి వైద్యం అందించారు. అప్పటికే 9 ఆవులు మృతి చెందాయి. అనంతరం పంచనామా నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించాలని బాధితులు జాదవ్ ప్రేంసింగ్, భీంరావు, మానిక్‌రావు, దేవిదాస్, రాథోడ్ గణేశ్, రాజిబాయి, కృష్ణ, రాజేశ్ కోరుతున్నారు.



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ జైవంతరావు



వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ, తదితరులు

ఐటీడీఏలో ఆవిర్భావ వేడుకలు

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకుముందు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీవో భీంరావు, ఏవో రాంబాబు, ఈఈ భీంరావు, ఆర్సీఓ గంగాధర్, ఐటీడీఏ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఎంపీపీ జైవంతరావు జెండావిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేశారు. పాత బస్టాండ్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ జాతీయ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం, ఎక్బాల్, రాజమణి, నాయకులు అజీం, నిసార్, రాధాబాయి, జుబేర్, మాబూద్, స్వామి, ఫయీం, రాజేశ్ పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- వ్యాయామానికి వినియోగం
- మధుమేహం నియంత్రణ, ఒత్తిడి దూరం



సైక్లింగ్ క్లబ్ సభ్యుల బృందం (ఫైల్)



నిర్మల్‌లో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవ నిర్వహణ (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: మూడు దశాబ్దాల క్రితం వరకు ఇళ్లలో సైకిల్‌ను వినియోగించేవారు. విద్యార్థులు, ఉద్యోగుల్లో చాలామంది సైకిళ్లపై బయటకు వెళ్లేవారు. ప్రస్తుత కాలంలో సైకిళ్ల వాడకం బాగా తగ్గిపోయింది. బైక్‌లు, కార్ల వాడకం పెరిగిపోయింది. ఈరోజుల్లో చాలామంది వ్యాయామ సాధనాలు, బరువు తగ్గడం, తదితర వాటికి సైకిల్‌ను ఉపయోగిస్తున్నారు. మరోవైపు సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉండడాన్ని గుర్తించి ఐక్యరాజ్యసమితి జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవంగా ప్రకటించింది. ఈ సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

సైకిల్ ప్రాధాన్యత తెలిపేలా..

జిల్లా కేంద్రానికి చెందిన వైద్యులు బీఎల్ఎస్ రెడ్డి, రామకృష్ణ, రఘునందన్ రెడ్డి తదితరులతో కూడిన బృందం సైకిల్ ప్రాధాన్యతను తెలియజేస్తున్నారు. క్రియాశీలక సభ్యులతో సైక్లింగ్ క్లబ్ ఏర్పాటు చేశారు. ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి పాలజీ గణేశ్ ఆలయానికి 75 కి.మీ, నిర్మల్ నుంచి ఆదిలాబాద్ జిల్లా జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శివరాత్రి జాగరణకు సైకిల్‌పై 200 కి.మీ యాత్ర చేపట్టారు. కాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సైకిల్ రైడ్, గాంధీ జయంతిని పురస్కరించుకొని 305 కి.మీ, అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాంజీగోండ్ సైకిల్ యాత్ర వంటివి చేపట్టారు. పర్యావరణ దినోత్సవ సైకిల్ ర్యాలీ లాంటివి చేపడుతూ సైక్లింగ్ ప్రాధాన్యతను తెలియజేస్తున్నారు.

నేడు సైకిల్‌యాత్ర

ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాకేంద్రంలో 20 కి.మీ సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 5:30 గంటలకు శివాజీ చౌక్ నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొంటారని వివరించారు.

సైకిలింగ్ ద్వారా ప్రయోజనాలు..

- రోజుకు కనీసం గంట నుంచి 2 గంటల వరకు సైకిల్ తొక్కడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- మధుమేహం నియంత్రణ, ఒత్తిడిని తగ్గిస్తుంది. అదేవిధంగా బరువు తగ్గడం, కొలెస్ట్రాల్‌ను తగ్గించడంతోపాటు గుండెపోటు, కొన్ని క్యాన్సర్లు, డిప్రెషన్, మధుమేహం ఊబకాయం, కీళ్లనొప్పులు తీవ్ర వ్యాధుల నుంచి రక్షించడంలో సైక్లింగ్ సహాయపడుతుంది. సైకిల్ తొక్కడం వల్ల కాళ్లలో బలం పెరుగుతుంది.
- సైక్లింగ్‌తో ఆరోగ్యం. అన్ని వయసుల వారికి అనుకూల వ్యాయామం. సైకిల్ ద్వారా దుకాణాలు, పార్క్, పాఠశాల లేదా కార్యాలయానికి వెళ్లడం ద్వారా మీ జీవనశైలిలో భాగం చేసుకోవచ్చు.

సైక్లింగ్ చేస్తున్నా



నిర్మల్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదివేవాడిని. గ్రామం నుంచి పట్టణానికి, ఇంటర్ స్థాయి వరకు సైకిల్‌పై వచ్చి చదువుకున్నాను. రెండు దశాబ్దాలకు పైగా సైకిల్ వినియోగించాను. సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ఉదయం సైక్లింగ్ చేస్తుంటాను.

– కొండూరు నరేశ్, లంగ్డాపూర్

గాలికి తెగిన జెండా



కడెం: రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేకాధికారి రాజశేఖర్‌గౌడ్ ఆదివారం జాతీయ జెండాను ఎగురవేశారు. సాయంత్రం ఈదురుగాలులకు జెండా తాడు తెగి పక్కన ఉన్న చెట్టుపై పడింది. గమనించిన సిబ్బంది జెండాను కిందకు దించారు.

నేటి నుంచి టోల్ పెంపు

- ఉమ్మడి జిల్లాలో మూడు టోల్‌ప్లాజాలు
- ఇక వాహనదారులకు 1 నుంచి 5శాతం పెరిగిన టోల్



రోల్‌మామడ టోల్‌ప్లాజా

నేరడిగొండ: దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై మళ్లీ టోల్‌చార్జీలు పెరిగాయి. ఏటా ఏప్రిల్ 1 నుంచి పెంచే ఈ చార్జీలు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా వేయాలని ఎన్‌హెచ్ఏఐని ఈసీ ఆదేశించింది. చివరి విడత ఎన్నికలు ముగిసిన అనంతరం పెరిగిన చార్జీలు ఈనెల 2వ తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే నేషనల్ హైవే 44 జాతీయ రహదారిపై ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని జైనథ్ మండలం పిప్పర్‌వాడ, నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ, నిర్మల్ జిల్లాలోని గంజాల్ టోల్‌ప్లాజాలు ఉన్నాయి. వీటి వద్ద నుంచి పెద్ద ఎత్తున వాహనాలు వెళ్తుంటాయి. కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు వెళ్లే ఈ రహదారిపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద ప్రతీరోజు 6వేల నుంచి 7వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద 5వేల నుంచి 6వేల వరకు, గంజాల్ టోల్‌ప్లాజా వద్ద 8వేల నుంచి 10వేల వరకు వాహనాలు వెళ్తుంటాయి.

తాజాగా పెరిగిన టోల్‌చార్జీలు ఇలా..

కార్లు, జీపులు, వ్యాన్‌లకు రెండు వైపులా ప్రయాణానికి రూ.5, చిన్న లారీ, పది టైర్ల లారీలకు రూ.10 పెరిగాయి. వాణిజ్య భారీ గూడ్స్ లారీలకు రూ.15 పెరిగాయి. మొత్తం 5 శాతం మేర టోల్ చార్జీలు పెంచినట్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా తెలిపింది.

కలప స్మగ్లర్ల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎఫ్‌వో

ఇచ్చోడ: టైగర్‌జోన్ అటవీపరిధిలోని సిరికొండ సెక్షన్ 189 కంపార్ట్‌లో కలప స్మగ్లర్లను శనివారం రాత్రి పట్టుకున్నట్లు డీఎఫ్‌వో ప్రశాంత భాజీరావు పాటిల్ తెలిపారు. మండలంలోని కలప డిపోలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. అటవీశాఖకు చెందిన ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో సిరికొండ అటవీప్రాంతంలో సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. సాత్‌మోరి బీట్‌లో కలప దుంగలను నరుకుతున్న నలుగురిని గుర్తించారు. అటవీ అధికారులను చూసి ఇద్దరు పరారీ అయ్యారు. మరో ఇద్దరిని అదుపులో తీసుకుని కలపతోపాటు వారి వద్ద నుంచి రూ.39,700 విలువ గల మోటార్ బైక్, ఎడ్లబండిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌వో తెలిపారు. స్మగ్లర్లను కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఇచ్చోడ టైగర్‌జోన్ అటవీఅధికారి గణేశ్, డిప్యూటీ రేంజ్ అధికారి అమర్‌సింగ్, ఎఫ్‌బీవో బాగుబాయి, సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు





గాయపడ్డ కుర్ర నందకిశోర్, బొట్టు వంశీ

కుంటాల: మండలంలోని కల్లూర్–కుంటాల రహదారిపై అందాకూర్ చెరువు చివరికట్ట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..నిర్మల్ పట్టణంలోని కావేరి జనరల్ స్టోర్ యజమాని కుర్ర నందకిశోర్ తన మిత్రుడు భాగ్యనగర్‌కు చెందిన బొట్టు వంశీతో కలిసి పని నిమిత్తం మండలంలోని అంబకంటి, కుంటాలకు బైక్‌పై ఆదివారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో అందాకూర్ చెరువు కట్ట మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో ఇరువురికి గాయాలయ్యాయి. అటుగుండా వస్తున్న కానిస్టేబుల్ రంజిత్ కుమార్ గమనించి గాయాలైన వంశీని కారులో ఎక్కించారు. స్థానికులు నందకిశోర్‌ను 108లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్‌కు పంపించారు. ఘటనా స్థలి నుంచి బైక్‌ను కానిస్టేబుల్ రంజిత్ కుమార్ బయటకు తీసుకువచ్చి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. ఆయనను పలువురు అభినందించారు.

లక్ష్మణచాంద మండలంలో..

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మణచాంద నుంచి ధర్మారం వెళ్లేదారిలో కోతి దేవుని ఆలయం సమీపంలో మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో లక్ష్మణచాందకు చెందిన గంగాధర్, పెద్దులకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది వారిని నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ఆదిలాబాద్‌రూరల్: వడదెబ్బతో వృద్ధుడి మృతిచెందాడు. స్థానికుల, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన నడిపెల్‌వార్ విష్ణు (65) కొన్ని నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నారు. ఈ క్రమంలో బేల్లూరి శివారు ప్రాంతానికి వెళ్లగా ఆదివారం వడదెబ్బ తగలి మృతిచెందారు. అటు వైపు ప్రజలు గమనించి డయల్ 100కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఆదిలాబాద్ రూరల్ పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలిపారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తీసుకెళ్లారు.

జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య

ఖానాపూర్: జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని గోసంపల్లె పంచాయతీ పరిధిలోని నడింపల్లె గ్రామానికి చెందిన చిప్ప సతీశ్(35) జులాయిగా తిరుగుతుండేవాడు. మద్యానికి బానసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. తల్లి వెంకవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పల్సి(బి)లో పానీపాట్లు





అడుగంటిన బావిలో నుంచి నీటిని తాడుతో తీస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని పల్సి(బి) గ్రామస్తులకు పానీపాట్లు తప్పడం లేదు. గ్రామంలో వారం రోజులుగా భగీరథ నీరు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. మొత్తం 100 కుటుంబాలు ఉన్నాయి. ఆదివారం ఉదయం 5 గంటలకు గ్రామస్తులు అర కిలోమీటర్ కాలినడకన గ్రామ సమీపంలోని బావి వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకున్నారు. పది బకెట్లు నీటిని తోడాక అడుగంటడం, మళ్లీ ఊరేదాక గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని కోరారు.

వరికుచ్చులను మెచ్చుకున్న సీఎం



వరికుచ్చులను సందర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, తదితరులు

నిర్మల్: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో జిల్లా నుంచి ప్రదర్శనలో ఉన్న ధాన్యపు కుచ్చులు ప్రత్యేక ఆకర్షణగా నిలువడమే కాకుండా.. సీఎం రేవంత్‌రెడ్డి సహా ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఆదివారం సాయంత్రం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీటిని ప్రదర్శించారు. జిల్లాకు చెందిన డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీఆర్‌డీఏ, సెర్ప్ సిబ్బంది కలిసి వరికుచ్చులను ప్రత్యేకంగా తయారు చేశారు. చేనేత, ఇతర కళాకృతుల కంటే ఈసారి ధాన్యపుసిరిని కళ్లకు కట్టించే వరికుచ్చులు అందరినీ ఆకట్టుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ, కమిషనర్ అనితా రామచంద్రన్, సంగీత దర్శకుడు కీరవాణి పరిశీలించారు.

ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో గల సత్యనారాయణస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. ఆలయంలోని హుండీని పగులగొట్టి అందులో రూ.4 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఆలయ పూజారి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీకి విఫలయత్నం



పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం చేశారు. పూజారి నరేశ్ శర్మ, భక్తులతో కలిసి ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాల కోసం ఆలయానికి వెళ్లారు. ప్రధాన ద్వారం తలుపు తెరవడం, తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుమాంజలి అక్కడి చేరుకుని పరిసరాలు పరిశీలించి క్లూస్‌టీంను రప్పించారు. ఫింగర్ ప్రింట్ అధికారి బాలాజీ, మహేశ్, డాగ్‌స్క్వాడ్ మహిపాల్, డాగ్ హంటర్‌తో పరిశీలించారు. పూజారి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.